బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో వికలాంగుడికి ఆర్థిక సాయం

తలమడుగు : ఆదిలాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ఎల్పుల నర్సిములుకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తలమడుగు శాఖ ఆధ్వర్యంలో రూ.6వేలు అందజేశారు. నర్సిములు గతంలో జిన్నింగ్ మిల్లు కార్మికుడిగా పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఎడమ కాలు నుజ్జు నుజ్జు అయింది. సంపాదించిన డబ్బు వైద్యానికి ఖర్చు చేయడంతో ఆర్థికంగా దిగజారిపోయాడు. విషయాన్ని తెలుసుకున్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సిబ్బంది బాధితుని ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం చేశారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేనేజర్ శ్రీకాంత్, ప్రత్యేక అధికారి కాడే స్వామి, హెడ్ క్యాషియర్ శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది ఫణిందర్, కామేష్ ఉన్నారు.



అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 16 జులై 2023

రివిలేషన్ పాఠశాలలో ఆషాఢమాసం బోనాల సంబురాలు

నవతెలంగాణ - హాజీపూర్

మంచిర్యాల పట్టణంలోని రివిలేషన్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆషాడమాసంలో జరుపుకునే బోనాల పండగను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నృత్యాలతో పండుగను సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రావు మాట్లాడుతూ బోనాల జాతర విశేషాన్ని విద్యార్థులకు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతిలో భాగంగా ప్రతి ఆషాఢమాసంలో బోనాల జాతర జరుపుకుంటామని పేర్కొన్నారు.



పత్రాల కోసం పరేషాన్..!

- ఎన్నికల విధుల్లో తలమునకలైన రెవెన్యూ సిబ్బంది
- కుల, ఆదాయ ధ్రువపత్రాలు జారీలో తీవ్ర జాప్యం
- కార్యాలయాల వద్ద విద్యార్థులు..లబ్ధిదారుల నిరీక్షణ
- దరఖాస్తులకు గడువు మీరుతోందని ఆందోళన

ఉద్యోగమైనా..సీటు అయినా..రుణమైనా..ఉపాధి కోసమైనా తప్పనిసరిగా కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రం తప్పనిసరి. కానీ దీనిని పొందాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఈ ధ్రువపత్రాలు జారీ చేయాల్సిన రెవెన్యూ అధికారులు.. సిబ్బంది ఎన్నికల విధుల్లో తలమునకలై ఉండటంతో ఆయా పత్రాలు సకాలంలో లభించని పరిస్థితి ఉంది. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభం కావడం.. ఆయా పాఠశాలలు, కళాశాలల్లో కొత్తగా కోర్సుల్లో చేరే విద్యార్థులు తప్పనిసరిగా ఈ ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. కానీ సకాలంలో అందకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు వివిధ పథకాల కోసం దరఖాస్తులు చేయాల్సిన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయాలకు వెళ్లి అడిగితే తాము ఎన్నికల విధుల్లో తీరిక లేకుండా ఉన్నామని.. సర్టిఫికేట్లు ఇప్పుడు అందజేయడం కుదరదని ఖరాఖండిగా చెప్పేస్తున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు, సిబ్బందికి ఎన్నికల పనులు అత్యవసరమైనప్పటికీ.. ఇదే సమయంలో లబ్ధిదారులకు కూడా సర్టిఫికేట్లు అవసరం ఉండటం సమస్య తీవ్రతకు దారితీస్తోంది.



పత్రాల కోసం ఎస్సీ కార్పొరేషన్‌కు వచ్చిన ప్రజలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ పథకాలతో పాటు వివిధ ప్రవేశాలు, ఉద్యోగాలు తదితర అన్ని పనులకు ధ్రువీకరణపత్రాలు అందజేయడం తప్పనిసరిగా మారింది. ఏ అవసరం కోసం దరఖాస్తులు చేసినా ఆధార్‌తో పాటు కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు తప్పనిసరిగా అందజేయాల్సి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ పత్రాల జారీలో జాప్యం జరగడం మూలంగా లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం ఆయా పత్రాలు జారీ చేసేందుకు పక్షం రోజుల పాటు వ్యవధి ఉన్నప్పటికీ.. ఆ నిబంధనలు దాటిపోతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం కొన్ని నోటిఫికేషన్లకు చాలా తక్కువ గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించడంతో లబ్ధిదారులకు అవరోధంగా మారుతోంది. ఇదే సందర్భంలో ఆయా ధ్రువపత్రాలను పొందడం కోసం పడరానిపాట్లు పడాల్సి వస్తోంది. దరఖాస్తులు నింపడంతో పాటు గజిటెడ్ అధికారుల సంతకాలు, ఆర్ఐ, తహసీల్దార్ ఇలా అందరి సంతకాలు పూర్తికావాలంటే రోజుల వ్యవధి పడుతోంది. దీంతో సుమారు వారం, పది రోజుల వరకు సర్టిఫికేట్లు లభించే పరిస్థితి లేకపోవడంతో ఆయా ప్రవేశాలు, పథకాలకు దరఖాస్తులు చేయడం కష్టతరంగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కార్యాలయాల వెంట ప్రదక్షిణ

కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల కోసం లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయాల వెంట ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల బీసీ రుణాలకు దరఖాస్తు చేసేందుకు కూడా సర్టిఫికేట్ల కోసం తీవ్ర అవరోధాలు ఏర్పడ్డాయి. మరోపక్క రానున్న డిసెంబర్‌లోనే సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయనే ప్రచారంతో అధికార యంత్రాంగం వీటి పనులపైనే అధికంగా దృష్టి కేంద్రీకరిస్తోంది. తాజాగా వారం రోజుల పాటు ఓటర్ల నమోదు ప్రక్రియను చేపడుతున్న రెవెన్యూ సిబ్బంది ఈ పనిని పూర్తిచేయడంపైనే దృష్టిసారించారు. దీంతో మిగితా పనులకు ఆటంకం కలుగుతోంది. ప్రభుత్వం ఇటీవల ఎస్సీ విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల్లో అవకాశం కల్పించేందుకు బెస్ట్ అవేలేబుల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు కోరింది. ఈ నెల 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు చివరి గడువు ఉండటంతో ఈ సమయంలోగా సర్టిఫికేట్లు పొందడం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఇబ్బందికరంగా మారుతోంది. ప్రస్తుతానికి ఆయా ధ్రువపత్రాలు లేకపోయినా దరఖాస్తు చేసినట్లు రసీదు సమర్పించినా దరఖాస్తులు తీసుకుంటున్నారు. కానీ ఈ నెల 18వతేదీలోపు తప్పనిసరిగా ధ్రువీకరణపత్రాలు అందజేయాలని సూచిస్తున్నారు. మూడు రోజులు మాత్రమే గడువు ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గడువులోపు అందుతాయా లేదా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి సర్టిఫికేట్ల జారీ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.సకాలంలో అందజేసేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేతకానీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలి



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్రంలో గల 18 జిల్లాల్లో విస్తరించి ఉన్న నేతకానీ కులస్తులకు అన్ని పార్టీలు రాజకీయ అవకాశాలు కల్పించాలని నేతకాని మహార్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణ, సమన్వయ కమిటీ చైర్మెన్ కొత్తపల్లి గంగేష్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి రాజకీయ పార్టీ నేతకానీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్ప రాజకీయ అవకాశాలు కల్పించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఓట్లు మీవి సీట్లు మావి అన్నట్లుగా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీల తీరుపై ఈ నెల 23న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలో రాజకీయ అవగాహనా సదస్సు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నేతకాని మహార్ హక్కుల సాధన కోసం ఇంద్రవెల్లి, ఉట్నూర్ మీదుగా జన్నారం చేపట్టనున్న చైతన్య యాత్ర ద్వారా నేతకానీ కులస్తులు రాజకీయలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సులకు నేతకాని మహార్ హక్కుల సాధన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జనగామ నరేష్, దుర్గం అశోక్, దుర్గం శేఖర్, దుర్గం రాకేశ్, హాజరవుతున్నందున నేతకాని కులస్థులు కుటుంబాలతో కలిసి సదస్సుల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు జాడి రాజేశ్, జిల్లా అధ్యక్షులు ఆకుదారి రాయలింగులతో కలిసి చైతన్య యాత్ర పోస్టర్లు ఆవిష్కరించారు.

ప్రజల సంక్షేమం పట్టని బీఆర్ఎస్ ప్రభుత్వం



నవతెలంగాణ-సిర్పూర్(టి)

పేద ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లుగా అన్ని విధాలుగా మోసం చేసిందని టీపీసీసీ సభ్యులు కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మార్కెట్ ఏరియాతో పాటు గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ మానిఫెస్టోను వివరించారు. పేద ప్రజలకు అనుగుణంగా ఉండాలనే ఉద్దేశంతో మానిఫెస్టో విడుదల చేశామన్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సిర్పూర్ ప్రాంతం వెనక పడేసిన ప్రాంతమని, తెలంగాణ రాష్ట్రాన్ని ఎందరో అమరవీరుల త్యాగ ఫలితంగా వచ్చిన తెలంగాణాలో బాగుపడింది కేవలం కేసిఆర్ కుటుంబమేనని తెలిపారు. నీళ్లు, నిధులు నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో ఒక్కరికి కూడా ప్రయోజనం కాలేదన్నారు. డబుల్ బెడ్ రూం అని ప్రజలను మభ్యపెట్టడమే తప్ప ఒక్కరికి కూడా ఇచ్చిన దాఖలాలు కనిపించడం లేదని తెలిపారు. సిర్పూర్ ప్రాంతం అభివద్ధి చెందాలంటే కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ అధ్యక్షులు దాసరి వెంకటేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీవర్ధన్, మండల అధ్యక్షులు షాబుద్దిన్, మైనార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఫహద్ అహ్మద్ పాల్గొన్నారు.

మన ఊరు మన బడి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



నవతెలంగాణ - రెబ్బెన

ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్‌లు, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో వెయిటింగ్ హాల్, మూత్రశాలలు, అదనపు తరగతి గదులు, పెండింగ్‌లో ఉన్న ఇతర పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్‌లు, ఉపాధ్యాయులు భాస్కర్ పాల్గొన్నారు.

బీసీ రాజకీయ ప్లీనరీకి నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో నిర్వహించే బీసీ రాజకీయ ప్లీనరీకి బీసీ సంఘం నాయకులు శనివారం హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనాభాలో మెజారిటీ బీసీలు ఉన్నప్పటికీ రాజకీయాల్లో సరైన ప్రాధాన్యత ఏ పార్టీ ఇవ్వడం లేదని రాజ్యాధికారం కోసం బీసీలు ముందడుగు వేయాలని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకొని రాజ్యాధికారానికి అధికారానికి దూరం చేస్తున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా బీసీ రాజ్యాధికారం దిశగా అడుగు వేయాలన్నారు. హైదరాబాద్ బయలుదేరిన వారిలో జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేశ్, జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షులు పురోషోత్తం, బాలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, లవ్ కుమార్, జిల్లా యూత్ గౌరవ అధ్యక్షులు గుర్నూలే మారుతీ, జిల్లా యూత్ సంఘం అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్, నాయకులు ప్రశాంత్, రైతు జిల్లా అధ్యక్షులు వైరగడే మారుతీ పటేల్ ఉన్నారు.

ఫూలే చూపిన మార్గంలో నడవాలి

- జిల్లాలో బీసీల పాత్రపై రౌండ్ టేబుల్ సమావేశం



నవతెలంగాణ - హాజీపూర్

ఫూలే చూపిన మార్గంలో నడవాలని బీసీ జాగృతి నాయకులు అన్నారు. తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోని హెచ్‌బీ ఫంక్షన్ హాల్‌లో జిల్లాలో బీసీల పాత్ర అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బీసీలు వెనుకబడిన వారు కాదని, వెనుక బడేసిన వాళ్లని తెలిపారు. ఫూలే చూపిన మార్గంలో బలహీనవర్గాల వారు విద్యా ఉద్యోగ రాజకీయాలలో ముందంజలో ఉండాలన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో బీసీ ఎమ్మెల్యేను ఎన్నుకోవటానికి బడి, గుడి రచ్చబండ చర్చలలో బీసీ వాదం ముందుకు వచ్చే విధంగా బీసీ కుల సంఘాల సంఘాలన్నీ ఐక్యమై పోరాడాలని తెలిపారు. అగ్రవర్ణాలు బీసీలను ఐక్యం కాకుండా చూస్తున్నారన్నారు. చుంచు లక్ష్మయ్య లాగా ప్రతిసారి పోటీ చేస్తూ ఉండాలని, ఏ పార్టీ నుండి అయినా బీసీ బిడ్డకు బీ ఫామ్ ఇస్తే అందరూ సపోర్ట్ చేయాలని, బీసీ కుల సంఘాలన్నీ కలిసి మంచిర్యాలలో 50వేల నుండి లక్ష మందితో బీసీ గర్జన పెట్టి ఏ పార్టీ బీసీ టికెట్ ఇస్తే ఆ పార్టీ వారికే సపోర్ట్ ఉంటుందని ఐక్యంగా తెలపాలని పేర్కొన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో బీసీలకు టికెట్ ఇస్తే తప్పకుండా గెలుపు బీసీల వైపే ఉంటుందని ముక్తకంఠంతో నినదించారు. డాక్టర్ రమణ మాట్లాడుతూ దళిత గిరిజన సోదరులు మిలిటెంట్ పోరాటం చేస్తూ ఎదిగారని, కానీ బీసీలు సమాజంలో నలిగిపోతున్నారన్నారు. బీసీలు శాసించే స్థితిలో ఉన్నా కూడా ఆశించే స్థితి బీసీలలో ఉందని జనబలం ఉన్నా కూడా ఐకమత్యం కొరవడిందని తెలిపారు. అందరూ ఐక్యమైతే మంచిర్యాల నియోజకవర్గంలో బీసీ ఎమ్మెల్యేను చూడడం పెద్ద విషయం కాదన్నారు. ప్రధాన పార్టీలకు తెలిసేలా బీసీలకు ఇక్కడ టికెట్ ఇవ్వకుంటే వేరే నియోజకవర్గాలలో ఇతరులను ఓడిస్తామని ధైర్యంగా ప్రకటించి ముందుకు వెళితే అనుకున్న లక్ష్యాలను సాధించడం పెద్ద విషయం కాదని తెలిపారు. తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షులు నరేడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ కుల సంఘాలన్నీ ఐక్యమయ్యే విధంగా కార్యాచరణ తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్ గౌడ్, డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, బిఎస్ఆర్ కేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఐలయ్య, ప్రముఖ న్యాయవాది కర్రే లచ్చన్న, ప్రైవేట్ విద్యా సంస్థల అధ్యక్షులు రాపోలు విష్ణువర్ధన్, సీనియర్ బీసీ నాయకులు తుల మధుసూదన్‌రావు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బద్రి శ్రీనివాస్, మంచర్ల సదానందం, దొమ్మటి అర్జున్, బొడ్డు శంకర్, దొమ్మటి సత్తయ్య, భోగి సత్తన్న, నుడికొండ ప్రకాష్, నాగేందర్, పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్టాల మల్లేష్, ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి లక్ష్మణ్, జక్కుల రాజు, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు పెద్దపల్లి సూరన్న, బియ్యాల సత్తయ్య, చింతల మల్లేష్, కార్యదర్శి వెన్నంపల్లి రవి, జక్కం రవీందర్, వైద్య రవి అక్కెనపల్లి మధు, కుడుక మోహన్, గుర్రం కనకరాజు, గుమ్మల సుదర్శన్, నులిగొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు భారీ స్పందన



నవతెలంగాణ - హాజీపూర్

తెలంగాణ జాగృతి నాయకులు, హైకోర్టు లాయర్ అక్కల తిరుపతి వర్మ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యుకులకు జాబ్‌మేళా నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకు భారీ స్పందన వచ్చింది. అదనకు కలెక్టర్ రాహుల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నిర్వాహకులను అభినందించారు. 90కి పైగా కంపెనీలు వచ్చాయి. 6వేల మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. 4వేల మందికి ఉపాధి లభించింది. ఫంక్షన్ హాల్ నిండి నిరుద్యోగులు స్టేషన్ రోడ్డులో క్యూలైన్‌లో నిలబడ్డారు. అందరికీ భోజన సౌకర్యం కల్పించారు. ఉద్యోగం సాధించిన వారు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కల తిరుపతి వర్మ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. చదువుకున్న వారు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ప్రైవేట్ ఉద్యోగాల్లో చేరాలన్నారు. స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా మాజీ ఆర్గనైజర్ అత్తె సరోజ, డాక్టర్ చుంచు రాజ్ కిరణ్, జాగృతి నాయకులు పాల్గొన్నారు.

నూతన రక్త పరీక్ష యంత్రం ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-8 డిస్పెన్సరీలో సుమారు రూ.1,60,000తో నూతన హెచ్‌బిఎ-1సీ ఎనలైజర్‌ను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ దిశా నిర్దేశంలో సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల వైద్య సౌకర్యార్థం అధునాతన యంత్రాలను ప్రవేశపెట్టామన్నారు. ఈ నూతన హెచ్‌బిఎ-1సీ ఎనలైజర్ రక్త పరీక్ష యంత్రం ద్వారా సమయం వథా కాకుండా ఉంటుందని, రక్తంలోని మూడు నెలల గ్లూకోజ్ శాతాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. సంస్థ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నూతన యంత్రాలను తీసుకొచ్చామని తెలిపారు. దీనిని శ్రీరాంపూర్ ఏరియాలో ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే హరితహారంలో భాగంగా జీఎం, అధికారులు ఆర్కే 8, నస్పూర్ డిస్పెన్సరీలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రఘుకుమార్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, సుధాకర్, డీజీఎంలు అరవింద రావు, చిరంజీవులు, శివరావు, డిప్యూటీ సీఎంఓ పి.రమేష్ బాబు, డాక్టర్ మురళీధర్, డాక్టర్ వేదవ్యాస్, డాక్టర్ స్వప్న పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఫిజియోథెరపీ సేవా కేంద్రం ప్రారంభం

- మెరుగైన వైద్యమందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వయో వృద్ధుల ఫిజియోథెరపీ సేవా కేంద్రం, సైకియాట్రిక్ కేంద్రాన్ని శనివారం రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వైద్య చికిత్సల కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే అవసరం లేకుండా అన్ని రకాల సౌకర్యాలను సర్కారు దవాఖానాల్లోనే అందుబాటులో ఉంచుతున్నారని అన్నారు. ఆర్థోపెడిక్ సమస్యలు పెరుగుతుండడంతో ఫిజియోథెరపీ సేవలు అవసరమవుతున్నాయని, అందుకు అనుగుణంగానే రిమ్స్‌లో ప్రత్యేకంగా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పేదలకు నాణ్యమైన వైద్య చికిత్సలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ నాణ్యమైన వైద్యమందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫిజియో థెరపీ కేంద్రంలో అందించే వైద్య సేవల వివరాలు తెలియజేశారు. యంత్ర పరికరాలు సైతం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో డీఎమ్‌హెచ్ఓ నరేందర్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, శ్రీధర్, వైద్యులు తిప్ప స్వామి, జైనథ్ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్, సీనియర్ సిటిజెన్స్ కిష్టయ్య, లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి గంగారెడ్డి పాల్గొన్నారు.

వైద్య సేవలందించడంలో సింగరేణిది అగ్రస్థానం

- మెడికల్ క్యాంపుల ద్వారా వైద్య పరీక్షలు
- సింగరేణి డైరెక్టర్ బలరామ్



నవతెలంగాణ-జైపూర్

ఉద్యోగులకు వైద్య సేవలు అందించడంలో సింగరేణిది అగ్రస్థానమని డైరెక్టర్ బలరామ్ అన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ ప్రగతి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఏర్పాటు చేసిన మల్టీ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరాన్ని జనరల్ మేనేజర్ సురేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య విభాగాన్ని ఆధునీకరించడం కోసం సంస్థ కోట్లు వెచ్చించిందని పేర్కొన్నారు. దాదాపుగా 120 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ద్వారా ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గనుల వద్ద కార్యాలయాల్లో ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడం కోసం ప్రత్యేకంగా క్యాంపుల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంస్థలో పని చేస్తున్న ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకుంటుందన్నారు. ఈ క్రమంలోనే ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమం కోసం అనేకంగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పని ఒత్తిడి, కుటుంబ పరమైన బాధ్యతల్లో పడి చాలా మంది అనారోగ్యాల పాలవుతున్నారని, వారి సౌకర్యార్థం మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కోఆర్డినేషన్ జీఎం సురేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ బాలకోటయ్యతో పాటు హైదరాబాద్‌కు చెందిన మెడికవర్, వెల్నెస్, సౌజన్య డెంటల్, విన్ విజన్, వాసవీ ఈఅండ్‌టీ, క్యాన్సర్ ఆసుపత్రి వైద్య నిపుణులు, సహాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల అమ్మకానికి వ్యతిరేకంగా పోరాటం

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకానికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాటం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలోని ఎన్జీయు కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన కేంద్ర కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌బాయ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలన్నారు. ఏ ప్రభుత్వ రంగ సంస్థ కూడా ప్రభుత్వ ఆధీనంలో లేకుండా గంప గుత్తగా కొద్దిమంది ప్రైవేట్ వ్యక్తులకు అమ్మడం, వారి చేతుల్లో ఈ దేశ సంపద పోగు చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు, కార్మిక రంగానికి తీవ్ర నష్టమని పేర్కొన్నారు. ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ఈ నెల 22న జిల్లా సదస్సు ఎన్జీయు భవన్‌లో ఉంటుందని, జిల్లాలోని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆగస్టు 7,8న మహాపడవ్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఉంటుందని, జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ జిల్లా కార్యదర్శి అడేపు మహేందర్, నాయకులు తేజ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-దస్తురాబాద్



మండలంలోని మున్యాల ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థి అభినయ్‌ని శనివారం పాఠశాలలో శాలువాతో సన్మానించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ సింగారి కిషన్ హాజరై విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రతి ఒక్కరూ చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శారద శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాజు నాయక్, సర్పంచ్‌లు దుర్గం శంకర్, సురేష్ నాయక్, శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భట్టి విక్రమార్కను కలిసిన ఉమ్మడి జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు హైదరాబాదులోని సీఎల్పీ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఆయన చేపట్టిన చారిత్రక పీపుల్స్ మార్చ్ 1360 కిలోమీటర్ల పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ కార్యదర్శి గండ్రత్ సుజాత, విశ్వప్రసాద్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలని ఎంఈఓకు వినతి



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉర్దూ మీడియంలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పోషకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియంలో తెలుగు, ఉర్దూ, గణితం బోధించుటకు ఉపాధ్యాయులు లేరని వారు వాపోయారు. వందమంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోషకులు నసీర్ అయుబ్, నయీమ్‌లతో పాటు పోషకులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ నిర్ణయాలకు ఎంపీకి సంబంధం లేదు

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ మాధవ్



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర సమితి తీసుకున్న నిర్ణయాలకు ఎంపీ సోయం బాపురావుకు ఎలాంటి సంబంధం లేదని నిర్మల్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ మాధవ్ అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 23న రాజధాని నగరం హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఆదివాసులు పెద్ద ఎత్తున తరలిరావాలని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కావాలని ఎంపీ సోయం బాపురావుపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. అది సరైన పద్ధతి కాదని అన్నారు. తుడుం దెబ్బ రాష్ట్ర స్థాయి సమావేశానికి ఎంపీకి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు తుడుం దెబ్బ నాయకులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలి



నవతెలంగాణ-దస్తురాబాద్

మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని ఎంపీడీఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం హరితహారంలో భాగంగా మండల కేంద్రంలోని కొత్తగూడెంలో సర్పంచ్ రాజమణి శివయ్యతో కలిసి ఇంటింటికి ఆరు మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల వర్షాలు సమృద్ధిగా పడుతాయని, చెట్లు ప్రాణులకు మూలాధారమని అన్నారు. ప్రతి గ్రామంలో నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గత ప్రభుత్వాలు ప్రజల ఇబ్బందులను పరిష్కరించడంలో విఫలమయ్యాయని, తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని రాములు గూడలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. రూ.74 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అదేవిధంగా రూ.10లక్షలతో నిర్మించిన సవారిబంగ్లా షెడ్‌ను ప్రారంభించి, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 70 సంవత్సరాలకుపైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు కనీస వసతులను కల్పించడంలో విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, బీఆర్ఎస్ నాయకులు కుమ్ర రాజు, మెట్టు ప్రహ్లద్, సెవ్వ జగదీష్ యాదవ్, సర్పంచ్‌లు పెందూర్ గంగారాం, దుర్వ రాంచందర్ పాల్గొన్నారు.

కేజ్ వీల్స్‌తో రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

ట్రాక్టర్ల యజమానులు రోడ్డు నిబంధనలు అతిక్రమించి కేజీవీల్స్ ట్రాక్టర్లకు బిగించుకొని రోడ్లపైకి వస్తే శాఖ పరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఆర్.శంకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు వారి వారి గ్రామాలలో కేజ్ వీల్స్‌తో జరిగే నష్టాన్ని ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించాలని వివరించారు. అలాగే కేజ్‌వీల్స్‌తో రోడ్డుపైకి వచ్చిన ట్రాక్టర్లకు జరిమానా విధించడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెను ఉధృతం చేస్తాం

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-కడెం

రాష్ట్రంలో 50వేల మంది గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులు సమ్మెలో దిగి 10 రోజులు కావస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె ఉధృతంగా కొనసాగుతున్న, సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం చేయడం తగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శనివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. అనేక చోట్ల సర్పంచ్‌లు, తాత్కాలిక ట్రాక్టర్ డ్రైవర్లుగా అవతారం ఎత్తరాని తెలిపారు. శనివారం పెంబి మండలంలో గ్రామ సర్పంచ్ ట్రాక్టర్ నడుపుతుంటే దానికి తోడుగా ఎంపీఓ రత్నాకర్‌రావు గ్రామపంచాయతీ సిబ్బందిని బెదిరించడంతో కార్మికులు ధర్నా చేశారు. ట్రాక్టర్ బంద్ చేసి వెనుకకు తీసుకు పోయారని అన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులను చర్చలకు పిలిచి, వారి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కానీ వారిని బెదిరింపులకు గురి చేస్తున్న సర్పంచ్‌లు గానీ, ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ సెక్రటరీ తీరు మార్చుకోవాలని సీఐటీయూ నిర్మల్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేస్తుందని అన్నారు. కార్మిక లేబర్ యాక్టు ప్రకారమే కార్మికులు సమ్మె చేస్తున్నారని అన్నారు. జూలై 18న స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని అన్నారు. జూలై 21న జిల్లా కేంద్రంలో కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చి సమ్మె నివారణకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ డిమాండ్ చేస్తుందని అన్నారు. 11వ పీఆర్సీ జీఓ నెంబర్ 60 ప్రకారం సఫాయి కార్మికులకు రూ.15వేల 600 కారోబారి, బిల్‌కలెక్టర్, ట్రాక్టర్ డ్రైవర్లకు రూ.19వేల 500 వేతనం ఇచ్చి పర్మినెంట్ చేయాలని ఆయన తెలిపారు. కొన్ని జిల్లాలో డీపీఓలు ప్రమాద బీమా రూ.10లక్షలు కట్టించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో డీపీఓ అందరూ ప్రమాద బీమా కట్టించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మోడీ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తెలంగాణలో అమలు సాధ్యం కాదని రాష్ట్ర శాసనసభ తీర్మానం చేయాలని అన్నారు. కార్మికులు మరమనుషులు కాదని, కట్టు బానిసలు కాదని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని 12,769 పంచాయతీలో పనిచేస్తున్న అందరికీ పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మహేష్, మండల కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షులు నర్సయ్య, రాము, కిరణ్, కోశాధికారి మహేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఖానాపూర్ డివిజన్ నాయకులు ఉదయ్

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు ఉదయ్ అన్నారు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలోని విద్యార్థులు ఉన్నత విద్యను చదువుకోవాలనుకుంటే వందల కిలోమీటర్లు వెళ్లి చదువుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఎన్నికల్లో సమయంలో ఎమ్మెల్యే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కానీ రెండు పర్యాయాలు పూర్తికావస్తున్న హామీ మాత్రం అలాగే మిగిలిపోయిందని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉందని అన్నారు. అందులో నిరుపేద ప్రజలు ఎక్కువగా ఉన్నారని అన్నారు. ఉన్నత విద్యాసంస్థలు ఏర్పాటు కూడా లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడం కష్టంగా మారిందన్నారు. పేద విద్యార్థులు చదువుకోవడం కోసం ఇతరుల ప్రాంతాలకు వెళ్లి వేలాది రూపాయల ఖర్చు పెట్టి ఇబ్బంది పడాల్సి వస్తుందనీ అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభించి, పీజీ, ఎంసెట్, అగ్రికల్చర్, ఎంబీబీఎస్ లాంటి విద్యాసంస్థలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఖానాపూర్ నియోజకవర్గం నాయకులు కునాల్, ప్రణీత్, శివాజీ పాల్గొన్నారు.

గిరిజనేతరులకు పోడు పట్టాలివ్వాలి



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని గిరిజనేతరులకు సర్వే చేసిన పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని వివిధ గ్రామాల నుంచి శనివారం రైతులు తరలివచ్చి మండల కేంద్రంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పవన్ చంద్రకు, ఎంపీడీఓ సమద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 50 నుంచి 60 సంవత్సరాల నుంచి పోడు భూములను నమ్ముకుని బతుకుతున్నామని అన్నారు. పోడు రైతులను అన్ని ప్రభుత్వాలు కేవలం ఓట్ల కోసమే ఉపయోగించుకున్నాయని ఆరోపించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అయిన మన పట్టాలు మనకు వస్తాయని గత తొమ్మిది సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నా పోడు భూముల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో అందరి ఆశలు చిగురించాయని అన్నారు. అన్ని గ్రామాలలో పోడు కమిటీలు వేసి, అర్హులకు పట్టాలు పంపిణీ చేస్తారనే ఆశతో ఇన్నాండ్లు వేచి చూసామని అన్నారు. తీర చూస్తే కేవలం గిరిజనులకే పట్టాలి ఇవ్వడం విస్మయానికి గురి చేసిందని వాపోయారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం పోడు భూములు ఉన్న రైతులందరికీ వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల రైతులు గడ్డం భీమ్‌రెడ్డి, హీరాసింగ్, గస్కంటి రవి, సాబ్లె సంతోషిన్, సోలంకి ప్రశాంత్, అందుసింగ్, శ్రీను, సురేష్, మాన్సింగ్, రాజేందర్, వివిధ గ్రామాల మహిళలు, రైతులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఎస్పీ పర్యటనను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఈనెల 17న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండల కేంద్రానికి రానున్నట్లు, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు పెందూర్ అంకుష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహుజనుల బ్రతుకులు మారాలంటే బీఎస్పీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈనెల 17న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రానున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో బీఎస్పీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తారని అన్నారు. అనంతరం ఆదివాసుల ఆరాధ్య దైవం కేస్లాపూర్ గ్రామంలో కొలువు దీరిన నాగోబా ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేస్తారని అన్నారు. అక్కడి నుంచి ఇచ్చోడ మండల కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో తలపెట్టిన బహుజనుల ఆత్మ గౌరవ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి బహుజన సంఘాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ఉట్నూర్ డివిజన్ అధ్యక్షులు సోన్‌కాంబ్లే సునీల్, ఇంద్రవెల్లి మండల మహిళ విభాగం అధ్యక్షురాలు సోన్‌కాంబ్లే సుకేష్మ, పట్టణ అధ్యక్షుడు భవాలే కిరణ్, ఉపాధ్యక్షులు కాంబ్లే దీపక్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వం రాష్ట్ర జేఏసీతో చర్చలు జరపాలి
- ఐఎఫ్టీయూ డిమాండ్

నవతెలంగాణ- ఖానాపూర్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికులు, రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు ఐఎఫ్టీయూ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె ప్రారంభించి, పది రోజులు కావస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. కార్మికులు నిత్యం గ్రామాల్లో మురికి, చెత్త లేకుండా శుభ్రంగా ఉండటానికి ప్రధాన కారణం కార్మికులే అని అన్నారు. కార్మికుల శ్రమ వల్ల దేశంలో అనేక అవార్డులను తీసుకున్న విషయం మరచిపోయారా అని అన్నారు. జీఓ నెంబర్ 60 ప్రకారం సఫాయి కార్మికులకు రూ.15వేలు 600, కారొబారి, బిల్ కలెక్టర్ ట్రాక్టర్ డ్రైవర్లకు రూ.19వేలు 500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 50వేల ఉద్యోగ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ చట్టాలను అమలు చేసి ప్రమాద బీమా రూ.10లక్షలు, సాధారణ బీమా రూ.5లక్షలు ప్రభుత్వం కట్టాలన్నారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లు వెంటనే రాష్ట్ర జేఏసీతో చర్చలు జరిపి పరిష్కరించాలన్నారు. గ్రామపంచాయతీ సిబ్బందిపై కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శిలతో బలవంతంగా పనులు చేయించి, సమ్మె విచ్ఛిన్నానికి కుట్ర జరిగే ప్రయత్నం జరుగుతుందన్నారు. వెంటనే అటువంటి వారిపై తీవ్రంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్మికులపై ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, శేఖర్, నాగరాజు, స్వామి, కార్మికులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఆర్డీవోకు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బదిలీపై వెళ్తున్న ఆదిలాబాద్ ఆర్డీఓ రాథోడ్ రమేష్‌ను శనివారం అఖిల భారత ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ సమితి జిల్లా శాఖ అధ్యక్షుడు మాదం గంగాధర్, కేంద్ర కమిటీ సభ్యులు ఆశన్న, ఎం.రాజారాం, గాజరి వినోద్ కుమార్ ఉన్నారు.



గ్రామపంచాయతీ కార్మికుల వంటావార్పు

నవతెలంగాణ-ఇచ్చోడ

గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె 10వ రోజుకు చేరుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ రోడ్డుపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వంటావార్పు చేసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ మాట్లాడుతూ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహిముద్‌ఖాన్, మండల అధ్యక్షులు కళ్లెం నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎంపీటీసీ జాహిద్, బోథ్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మెన్ కొత్తూరి లక్ష్మణ్, బోథ్ నియోజకవర్గ మైనార్టీ చైర్మెన్ ముస్తఫా, పట్టణ అధ్యక్షులు బాబా, యూత్ అధ్యక్షులు నౌషత్, జిల్లా కార్యదర్శి భీమన్న బత్తుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కడెం

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం పెంబి మండలంలోని లోతోర్యతండాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుగ్లావత్ అశోక్(37) తనకున్న మూడెకరాల భూమితో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. వేసిన విత్తనాలు మొలకెత్తలేదని, దిగులు చెంది మద్యానికి బానిసై శనివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. మృతుడికి ఒక కొడుకు, ఒక కుమార్తె ఉన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడికి సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన కొయ్యల ఏమాజిని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి శనివారం ఘనంగా సత్కరించారు. జిల్లా కేంద్రంలోని ఆమె కార్యాలయంలో ఏమాజీని శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో బీజేపీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శివయ్య రాము, ఆనంద్ ఉన్నారు.

పెన్షన్ సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలి

- సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలనే లక్ష్యంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర శాఖ చేపట్టిన పాత పెన్షన్ సంకల్ప రథయాత్రను జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు కలిసి విజయవంతం చేయాలని శనివారం సీపీఎస్ ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పిలుపునిచ్చారు. సీపీఎస్ విధానం రద్దుతోనే ఉపాధ్యాయులందరికీ మేలు జరుగుతుందని అన్నారు. అనేక పోరాటాలు చేసి గ్రాట్యుటీ, కుటుంబ పెన్షన్ సాధించుకున్నామని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోరాటం చేసి పాత పెన్షన్ కూడా సాధిద్దామని ఆయన అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, కార్యాచరణ గురించి వివరించారు. రథయాత్ర ప్రతులను ఆవిష్కరించారు. సీపీఎస్ విధానం రద్దు అయ్యేంతవరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన అన్నారు. ఎన్నికలలోపు సీపీఎస్ రద్దు జరిగి, పాత పెన్షన్ పునరుద్ధరణ జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం భూమన్న, బాధ్యులు నగేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా బోనాల వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బోనాల వేడుకలను జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగానే శనివారం పలు పాఠశాలల్లో బోనాల వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక ఎస్ఆర్ డీజీ పాఠశాల, మాస్టర్ మైండ్ పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు అమ్మవారి, పోతురాజుల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముందుగా వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. విద్యార్థులకు సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు, బోనాల విశిష్టతను తెలిపేందుకు ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. అనంతరం చిన్నారులు, బోనాల పాటలపై విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంతిమయాత్రలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-కౌటాల

గ్రామ కామటి గొడిసెల మల్లయ్య అనారోగ్యంతో శనివారం మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ అంతిమయాత్రలో పాల్గొని ఆయన పార్థీవ దేహానికి నివాళులర్పించి పాడె మోశారు. కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మీరు అధైర్య పడొద్దని మనోధైర్యం నింపారు. ఆయన వెంట రాష్ట్ర కార్యనిర్వహణ కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షుడు మోర్లె గణపతి, జిల్లా ఇన్‌ఛార్జి సోయం చిన్నయ్య, నియోజవకర్గ అధ్యక్షుడు రాంప్రసాద్, అరుణ్, నవీన్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు గ్రామంలోని బీఎల్ఓలను సంప్రదించి తమ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సరిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేసుకొనేలా అధికారులు చూడాలని తెలిపారు. ఈ అవకాశాన్ని యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె

పెంచికల్‌పేట్ : మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. కార్మికుల సమ్మెకు మద్దతుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అసహాబేగ్ మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఇంటింటికి ఆరు మొక్కలు నాటండి



నవతెలంగాణ-కౌటాల

తెలంగాణకు హరితహారంలో భాగంగా శనివారం మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ ఒక్కో ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి మొక్కను బ్రతికేలా చూడాలని సూచించారు. మొక్కల పెంపకం వల్ల కాలుష్య నివారణ తగ్గడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, మొక్కలు పెంచడం వల్ల మానవాళి మనుగడను కాపాడినవారం అవుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఒజ్జెల మౌనీష్, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు మెర్పెల్లి బ్రహ్మయ్య, బీఆర్ఎస్ నాయకులు డబ్బ బాపు, సంతోష్, సోళ్ల బాపు, బండి శ్రీను, కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్స్

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య పేర్కొన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీ ఉన్న సీట్ల కోసం జూలై 18వ తేది లోపు పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని, 19న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

ఏఐటీయూసీలో సింగరేణి సులబ్ కార్మికులు చేరిక

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న సులబ్ కార్మికులు శనివారం ఏఐటీయూసీలో చేరారు. వారికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధి పథంలో నడుస్తుందంటే కాంట్రాక్ట్ కార్మికుల పాత్ర కీలకమైనదని అన్నారు. ఇప్పటికి వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగానే వివరిస్తుందని విమర్శించారు. సింగరేణి యాజమాన్యం వివిధ రకాల కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సులబ్ కార్మికులు లచ్చయ్య, నర్సయ్య, శ్రీనివాస్, మదునయ్య, కల్లేపల్లి రాజు, మల్లేష్, రౌతు లక్ష్మికన్నురు సుగుణ, విజయ పాల్గొన్నారు.

జైలు జీవితంతో పరివర్తన రావాలి

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జైలు జీవితంతో ఖైదీల ప్రవర్తనలో పరివర్తనం రావాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జీ కె.యువరాజ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని సబ్ జైలును శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పుల వల్ల ఒక కుటుంబం రోడ్డున పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారి ప్రేమ్ కుమార్, అడ్వకేట్ నరహరి, అసిస్టెంట్ లీగల్ న్యాయవాది అంజనీ దేవి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించిన విద్యార్థినికి ప్రోత్సాహకం



నవతెలంగాణనస్పూర్

రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించిన మంచిర్యాల జిల్లాకు చెందిన విద్యార్థిని శ్రీరాముల హరితకు ప్రోత్సాహకంగా రూ.5 లక్షల చెక్కు అందజేసినట్లు ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి విద్యార్థినికి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి విశేష కృషి చేస్తోందని అన్నారు. కార్పొరేట్ తరహా మౌళిక సదుపాయాలతో నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. జిల్లాలోని వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల వెంకటేష్-రాజేశ్వరి దంపతుల కూతురు శ్రీరాముల హరిత మందమర్రి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభాపూలే కళాశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించడం అభినందనీయమని అన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని గుండి నుండి కెరమెరికి అక్రమంగా తరలిస్తున్న 5 ఆవులను పట్టుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు అడ గ్రామ పరిసర ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తుండగా బొలెరోలో అక్రమంగా ఆవులను తరలించగా ఆపి ప్రశ్నించగా అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసిందని ఆవులను గోశాలకు తరలించి, వాటిని తరలిస్తున్న ఎస్.కె. హైదర్, ఎస్.అమీర్‌పై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

రైతులకు సరిపడా ఎరువుల పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతుల అవసరానికి సరిపడా ఎరువులు పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ మల్లికార్జున్ తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేసే ఎరువులను ఈదులవాడ గ్రామపంచాయతీలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్‌తో కలిసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్, సర్పంచ్ బూసి భీమేష్ పాల్గొన్నారు.

చంద్రయాన్-3 రూపకల్పనలో మనోడు

- టెక్నికల్ అధికారిగా కాగజ్‌నగర్ వాసి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

140 కోట్ల మంది భారతీయులను ఆశలు, ఆకాంక్షలను నింగిలోకి తీసుకువెళ్లిన అత్యంత ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్-3 తయారీలో కాగజ్‌నగర్ వాసి ఉన్నాడంటే ఆశ్చర్యం కలుగకమానదు. కాని ఇది నిజమే. ఈ రాకెట్ తయారీలో వేల మంది పాలుపంచుకున్నారు. కాని మన కాగజ్‌నగర్‌కు చెందిన బాలకుమారస్వామి టెక్నికల్ అధికారిగా ప్రధాన భూమిక పోషించడం మనకు గర్వకారణమని చెప్పవచ్చు.

13 ఏళ్ల క్రితం కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కొంతం బాలకుమార స్వామి శ్రీహరికోటలోని ఇస్రోలో ఉద్యోగం సాధించాడు. మొదట్లో టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన బాలకుమారస్వామి ప్రస్తుతం టెక్నికల్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. చంద్రయాన్-3 రూపకల్పనలో మూడు దశలు ఉండగా, ఇందులో చివరి దశ అయిన క్రయో దశలో టెక్నికల్ అధికారి పాత్ర కీలకం. రాకెట్‌లో అతి శీతల ద్రవ ఇంధనాలను స్టోర్, సర్వీసు చేయడం ఇక్కడ ప్రధానం. కౌంట్ డౌన్ ప్రారంభం నుండి పది గంటలలో ఈ పని పూర్తిచేయాల్సిన బృందంలో బాలకుమారస్వామి ఒకరు.



బాల్యమంతా కాగజ్‌నగర్‌లోనే

బాలకుమారస్వామి బాల్యమంతా కాగజ్‌నగర్‌లోనే కొనసాగింది. ఒకటి నుండి పదో తరగతి వరకు కాగజ్‌నగర్‌లోని బాలభారతి ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్ విద్యను ఇక్కడే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభ్యసించాడు. తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లోమా సాధించాడు. స్థానిక సిర్పూరు పేపర్ మిల్లులో 14 ఏళ్ల పాటు జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తూనే పలు పోటీ పరీక్షలకు హాజరయ్యాడు. శ్రీహరికోటలోని ఇస్రోలో 2010లో టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించి పదోన్నతిపై ఇపుడు టెక్నికల్ అధికారిగా కొనసాగుతున్నారు. సిర్పూరు పేపర్ మిల్లు ఉద్యోగి కొంతం నర్సయ్య-అనసూయ దంపతుల పెద్ద కుమారుడైన బాలకుమారస్వామికి ఇప్పటికీ కాగజ్‌నగర్‌లో స్వంత ఇల్లు ఉంది. అప్పుడప్పుడు కాగజ్‌నగర్‌కు వస్తూ పోతుంటాడు.

పాఠశాల పేరును నిలబెట్టాడు

ఎం వినోద్‌రావు, పీఈటీ, బాలభారతి ఉన్నత పాఠశాల



బాలకుమారస్వామి మా పాఠశాలలో 1988-89లో పదో తరగతి పూర్తి చేశాడు. మా పాఠశాల పూర్వ విద్యార్థి ఈ ఘనతలో పాలుపంచుకోవడాన్ని మరువలేం. అతని కృషిని అభినందిస్తున్నాం.

ప్రపంచం ఎదురుచూసే రాకెట్ తయారీలో భాగస్వామిని అవుతాననుకోలేదు

బాలకుమారస్వామి



చంద్రయాన్-3 ప్రయోగం కోసం ప్రపంచమంతా ఉద్విగ్నతతో ఎదురుచూస్తోంది. ఇలాంటి రాకెట్ తయారీలో నా పాత్ర పోషించడాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. జీవితంలో గుర్తుండిపోయే ఘటన ఇది. రాకెట్ లాంచింగ్ విజయవంతం కావడం సంతోషకరం. ఆ రాకెట్ లక్ష్యాన్ని చేరుకొని భారతదేశ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా పెంచుతుందని బలంగా విశ్వసిస్తున్నా. ఒక మూడు నెలలపాటు నిద్రాహారాలు మాని దీనికోసం కృషి చేశాం. మా కృషికి తగ్గ ఫలితం వచ్చింది.

ఇండియా పాక్ బార్డర్‌ను తలపిస్తున్న 'దిందా'

- సీఎం ప్రత్యేక నిధులేమయ్యాయి
- కోనప్ప ముక్కు నేలకు రాసి రాజీనామా చేయాలి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-చింతలమానపల్లి

సిర్పూర్ నియోజకవర్గంలోని దిందా గ్రామం ఇండియా, పాకిస్థాన్ బార్డర్‌ను తలపిస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా, చింతలమానెపల్లి మండలం దిందా గ్రామం వద్ద గల వాగును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దందా గ్రామానికి, ఇతర ప్రాంతాలకు సంబంధాలు తెగిపోతాయని ప్రభుత్వం గత 15 సంవత్సరాలుగా కనీసం బ్రిడ్జి నిర్మించక పోవడం అన్యాయం అన్నారు. సీఎం కేసీఆర్ తన గజ్వేల్ నియోజకవర్గం చుట్టూ రింగ్ రోడ్డు వేసుకుంటున్నారని, కానీ ఇక్కడి ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. సీఎం ప్రత్యేక అభివృద్ధి నిధి రూ.పదివేల కోట్ల నుంచి కనీసం రెండు కోట్లతో దిందా వాగుపై బ్రిడ్జి ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. ఇదే గ్రామానికి చెందిన విద్యార్థి ఎమిదేళ్ల క్రితం ఎంబీఎ చదువుతున్న రామకృష్ణ వాగులో పడి మరణించారని గుర్తుచేశారు. రామకృష్ణ పేరిట బ్రిడ్జి నిర్మిస్తామని కొబ్బరికాయ కొట్టిన ఎమ్మెల్యే తిరిగి ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వచ్చి దిందా వాగు ఒడ్డు మీద ముక్కు నేలకు రాసి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వాగుకు ఆవలివైపు ఉన్న గ్రామస్తులకు ఫోన్లో మాట్లాడారు. ఆ గ్రామంలోని పాఠశాలకు వెళ్లలేక ఆగిపోయిన పాఠశాల టీచర్లను కలిశారు. వర్షాకాలంలో ఆ గ్రామస్తులకు ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో చవడం ఒక్కటే మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్, కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, దయాకర్ రావు మంత్రులు ఇలాంటి పరిస్థితుల్లో నివసిస్తారా అని ప్రశ్నించారు. మీ ఫాంహౌస్‌లకు రోడ్లు ఇలాగే ఉంటాయా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుగు ప్రయాణంలో కాలినడకతో కేతిని గ్రామానికి చేరుకొని, ప్రధాన రహదారిపై వస్తున్న కంకర్ టిప్పర్ ఆపి ఇది ఆంధ్ర పాలకుల పాలన అని దుయ్యబట్టారు. తెలంగాణ కంకరను మహారాష్ట్రకు కమిషన్లకు అమ్ముతున్నట్లు, ఇంతకంటే ఇంకేం సాక్ష్యం కావాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్పపై ఫైర్ అయ్యారు. అదేవిదంగా మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే విద్యార్థుల సమస్యలు తీర్చాలని, రోడ్డు సౌకర్యం, జనరేటర్ సౌకర్యం కాంపౌండ్ నిర్మాణం, ఆటస్థలం గురించి కలెక్టర్‌కు లేఖ రాస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అర్షద్ హుస్సేన్, సీడం గణపతి, జిల్లా ఇన్‌ఛార్జి సోయం చిన్నయ్య, జిల్లా అధ్యక్షుడు గణపతి, మహిళా నాయకురాలు విజయ నిర్మల, నియోజకవర్గ నాయకులు రాంప్రసాద్, మండల నాయకులు గోమాసె లహంచు పాల్గొన్నారు.



గురుకుల ఉపాధ్యాయుల ధర్నా విజయవంతం చేయాలి

- ఐక్య గురుకులాల రాష్ట్ర కన్వీనర్ దూలం ఎల్లయ్య



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణలోని అన్ని యాజమాన్యాల గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై జులై 17న జిల్లా కలెక్టర్‌రేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు ప్రతి ఒక్క గురుకుల ఉపాధ్యాయుడు హాజరై విజయవంతం చేయాలని ఐక్య గురుకులాల రాష్ట్ర కన్వీనర్ దూలం ఎల్లయ్య అన్నారు. టీటీడబ్ల్యుఆర్‌జేపీ, టీఎస్‌డబ్ల్యుఆర్‌జేసీ, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ యజమాన్యాలలో వివిధ రకాల గురుకుల పాఠశాలలు రాష్ట్రంలో కొనసాగుతున్నాయని, ఒక్కొక్క యాజమాన్యంలో ఒక్కో రకమైన సమస్యలు ఉన్నాయని, గురుకుల పాఠశాలలన్నిటికీ ఒక కామన్ డైరెక్టర్‌రేట్ ఏర్పాటు చేయాలని, అన్ని గురుకులాలలో ఒకే రకమైన సమయపాలన ఉండాలని డిమాండ్ చేశారు. ఇతర పాఠశాలల కంటే గురుకుల పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు పని భారం, అదనపు బాధ్యతలు ఉంటున్నందున పారిటీ స్కేలు మంజూరు చేయాలని కోరారు. కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్, గెస్ట్, ఆవర్లి బేస్డ్‌ల పేరుతో ఉద్యోగులను నియమించి, పని ఒకే రకంగా ఉన్నప్పటికీ వేతనాలలో వ్యత్యాసాన్ని కొనసాగిస్తూ, విభజించి పాలించు అనే విధానాన్ని ప్రభుత్వం కొనసాగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం మంజూరు చేస్తూ అందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని గురుకులాల ఉపాధ్యాయులు ఏకం కావలసిన అవసరం ఉందని దీనికోసం ఈనెల 17న న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు కొమురంభీం జిల్లా కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల బాధ్యులు సింగతి ఉపేందర్, నరేందర్, సత్యనారాయణ, మాన్కు, వినోద్, చందు, శ్రీనివాస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఓపెన్ వర్సిటీ డిగ్రీలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

కాగజ్‌నగర్ : 2023-24 విద్యాసంవత్సరంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యునివర్సిటీ డిగ్రీలో ఆన్‌లైన్ ద్వారా ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎస్‌కెఈ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ పాస్ లేదా దానికి సమాన అర్హత కలిగిన అభ్యర్థులు బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 31లోగా అడ్మిషన్ తీసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9866398678 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి లయన్స్ క్లబ్ 320జి గవర్నర్ ఆదేశాల మేరకు శనివారం మందమర్రి దీపక్ నగర్ 16 వార్డులో 50 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు తిరుమలేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతీ ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని మొక్కల పెంపకంపై అందరూ ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అగుల్ల తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి కొక్కుల మధు, కోశాధికారి తౌటమ్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ లయన్ గౌతమ్, లయన్ సభ్యులు రమేష్, ఓదెలు పాల్గొన్నారు.

20న చలో ఎస్‌పీడీని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలోని కేజీబీవీ, యూఆర్ఎస్ (అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్) సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న చేపట్టే ఛలో ఎస్‌పీడీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి కోరారు. సమస్యల పరిష్కారానికి చేపడుతున్న ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం స్థానిక కేజీబీవీని సందర్శించి ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో పని చేసే ఉద్యోగులు అరకొర వేతనాలతో శ్రమదోపిడీకి గురవుతున్నారని అన్నారు. యూఆర్ఎస్ సిబ్బందికి వారాంతపు సెలవు, మెటర్నిటీ సెలవులు వర్తింపచేయడంతో పాటు వీరితో పాటు కేజీబీవీ సిబ్బందికి బేసిక్ పే అమలు చేయాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ కమిషన్ సూచన మేరకు ప్రతీ ఏడాది రూ.1000 ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఇంటర్ ప్రారంభించిన అన్ని కేజీబీవీలలో నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకం చేపట్టాలని, రెండో శనివారంతో పాటు ఆప్షనల్ సెలవులను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి రమా, మండల బాధ్యులు హారిక, ప్రసన్న, స్వాతి. స్నేహిత పాల్గొన్నారు.

ఆగస్టు 19న మహాధర్నా విజయవంతం చేయాలి

- తపస్ జిల్లా అధ్యక్షులు సయింపు శ్రీనివాసరావు



నవతెలంగాణ-భీమారం

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వచ్చేనెల 19న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నాట్లు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) మంచిర్యాల జిల్లా అధ్యక్షులు సయింపు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలోఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న తపస్ కార్యాచరణ పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ 317 ద్వారా ఉపాధ్యాయులు స్థానికతను కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం తపస్ రాష్ట్ర శాఖ ఉద్యమ కార్యాచరణను ప్రకటించిందని తెలిపారు. ఈ నెల 18 నుంచి 22 వరకూ క్లాంప్లెక్స్ స్థాయిలో టీచర్ల సంతకాల సేకరణ, 25న తహసీల్దార్ ఆఫీసుల వద్ద నిరసన కార్యక్రమాలు, 31న ఆర్డీఓలకు వినతిపత్రాలు ఇవ్వడం, ఆగస్టు 5న కలెక్టరేట్ల వద్ద ధర్నా చేపట్టడం జరుగుతుందన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే ఇందిరా పార్క్ వద్ద ఆగస్టు19న మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. తపాస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యాచరణలో ప్రతీ ఉపాధ్యాయుడు పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్, ఉపాధ్యక్షుడు అర్జయ్య, ప్రధాన కార్యదర్శి మహేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణం విజయబస్తీ చౌరస్తా నుండి సర్దార్ బస్తీ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప భూమి పూజ చేశారు. 4, 5 వార్డుల పరిధిలో ఉన్న ఈ రోడ్డు నిర్మాణానికి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ. 60 లక్షలు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, కమిషనర్ అంజయ్య, డీఈ రమాదేవి, కౌన్సిలర్లు శ్రీలత, సాగరిక, కె.శివప్రసాద్, విజయ్‌యాదవ్, మహ్మద్ వలీ, నియాజుద్దీన్ బాబా పాల్గొన్నారు.

గూడ్స్ రైలు ఢీ కొని హిజ్రా మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్, వేంపల్లి మధ్య గల రైల్వే గేటు వద్ద గూడ్స్ రైలు ఢీ కొని హిజ్రా(30) మృతిచెందినట్టు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం శనివారం వేంపల్లి రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీ కొని ప్రమాదవశాత్తు మృతిచెందిందని, మృతదేహాన్ని సిర్పూర్ సామాజిక ఆస్పత్రిలో మార్చురీలో భద్రపరిచినట్టు, ఎవరికైన వివరాలు తెలిస్తే సిర్పూర్, కాగజ్‌నగర్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ 9948481902 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఐదు క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నట్టు ఎస్సై సాగర్ తెలిపారు. శనివారం మండలకేంద్రంలోని ఆర్‌డీఓ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా వాంకిడి నుండి మహారాష్ట్రకు టాటాసుమో వాహనంలో షేక్ అబ్దుల్ రిజ్వాన్ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టుకున్నట్టు తెలిపారు. షేక్ అబ్దుల్ రిజ్వాన్‌పై కేసు నమోదుచేసినట్టు పేర్కొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
4
ఆదివారం 16 జులై 2023

పోగొట్టుకున్న ఫోన్ అందించిన పోలీసులు

నవతెలంగాణ-హాజీపూర్

పోగొట్టుకున్న ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 10రోజులలో గుర్తించి బాధితురాలికి అందించారు పోలీసులు. ఈ నెల 4న టీకన్నపల్లిలోని ప్రభుత్వ స్కూల్ టీచర్ నల్ల శైలజరాణి తన మొబైల్ ఫోన్‌ను స్కూల్ అయిపోయిన తర్వాత ఇంటికి వెళ్లే మార్గంలో పోగొట్టుకుంది. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సిఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ని గుర్తించి శనివారం ఎస్సై నరేశ్ కుమార్ అందజేశారు. సెల్‌ఫోన్‌ను గుర్తించి అప్పగించినందుకు బాధితురాలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం సీజనల్ వ్యాధుల నియంత్రణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నిత్యం పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహనా కార్యక్రమలు నిర్వహించాలని ఐకేపీ ఏపిఓ వాణిశ్రీ సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమన్నారు. వేడి పదార్థాలు మాత్రమే తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. నిల్వ నీటిని ఉంచరాదని, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని ఎంపీడీఓ శేఖర్ సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులు, మురుగు కాలువలు శుభ్రత, పారిశుధ్య నిర్వహణ గురించి ఎంపీవో నసీరుద్దీన్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ ప్రమీల, విఓఏ, ఆశా, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిఎస్ అన్నారు. శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చివరి రోజు పట్టణంలోని భాగ్యనగర్ నుండి తాటిగూడ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కాలనీలలోని వృద్ధులు, యువత, వ్యాపారస్తులు ప్రత్యేకించి మహిళలతో కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు లేనట్లయితే ఫామ్-6 పూరించి నమోదు చేసుకోవాలన్నారు. బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు గుడ్లు, పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తాటిగూడ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఓటరు నమోదుపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 1, 2013 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరణించిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లను తొలగింపుకు ఫారం-7, మార్పులు, చేర్పులకు ఫారం -8 ద్వారా సరిచేసుకోవచ్చని సూచించారు. సాంకేతిక, ఇతర కారణాలతో ఓటు హక్కు తొలగించబడినట్లైతే ఫారం-6 పూరించి సంబంధిత పోలింగ్ కేంద్రంలోని బిఎల్ఓ, తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, జన శిక్షణ సంస్థ ప్రతినిధులు సురేందర్, సిఆర్పీలు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగం పుష్పలత కుటుంబాన్ని ఆదుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నల్గొండ జిల్లా పానగల్ మిషన్ భగీరథలో పనిచేస్తూ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న మిషన్ భగీరథ కార్మికురాలు సింగం పుష్పలత కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, మూడెకరాల భూమి ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా అధ్యక్షుడు దివాకర్‌తో కలిసి మిషన్ భగీరథ ఈఈ వెంకటపతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే పుష్పలత ఆత్మహత్య చేసుకుందన్నారు. పెండింగ్లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని, మిషన్ భగీరథ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, వేతనాలు చెల్లించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రాజు, తేజ పాల్గొన్నారు.

గని కమిటీ సమావేశాల్లో అన్ని సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలి



నవతెలంగాణ-జైపూర్

గుర్తింపు సంఘం కాల పరిమితి అయిపోయినందున సింగరేణిలో అన్ని కార్మిక సంఘాలకు సమ ప్రాధాన్యత కల్పించాలని ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఐకే-1ఏ గని కమిటీ సమావేశంలో కేవలం గుర్తింపు సంఘం నాయకులకు మాత్రమే అవకాశం కల్పించడాన్ని గని పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా గని మేనేజర్‌కు ఏఐటీయూసీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించే వరకు అన్ని కార్మిక సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించే వరకు సింగరేణిలో అన్ని కార్మిక సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నామని డైరెక్టర్ బలరామ్ ప్రకటించిన విధంగా గని కమిటీ సమావేశాల్లో ఇతర కార్మిక సంఘాలు పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న సమావేశాలకు అన్ని కార్మిక సంఘాల వారిని ఆహ్వానిస్తున్న యాజమాన్యం గని కమిటీ సమావేశాలకు ఇతర కార్మిక సంఘాల వారికి అవకాశం ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నవీన్‌రెడ్డి, నాగభూషణ్, శ్రీకాంత్, హెచ్ఎంఎస్ నాయకులు సారయ్య పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్టాపన

జన్నారం : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్టాపన శనివారం ఉదయం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా గ్రామంలోని వారంతా హోమాలు చేశారు. రెబ్బెన మండలంలోని అచలాపూర్ వేద పాఠశాల వేద పండితులతో విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆలయ కమిటీ చైర్మన్ సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రరుప్తంగా ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బేడమ బొజ్జు, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు జాన్సన్ నాయక్, పూర్ణా నాయక్ జన్నారం ఎంపీపీ మాదాడి సరోజన రవీందర్రావు మాజీ ఎంపీపీ, సత్తుపల్లి రాజేశ్వరి సత్యం, ఇతర ప్రముఖులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జాడి రాజన్న చిందం చంద్రయ్య జాడి వెంకటయ్య పోషన్న, లచ్చన్న రవి శంకర్ సుధాకర్, బాలరాజు జాడి లచ్చన్న, జాన్సన్ యువసేన, నాయకులు ఫజల్‌ఖాన్, కేపే నరసింహులు, జక్కుల సురేష్, కాంగ్రెస్ నాయకులు ప్రభుదాస్ పసియుల్లా, కరుణాకర్‌చారి, దేవయ్య పాల్గొన్నారు.

పచ్చగడ్డి తింటూ పంచాయతీ కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల తమ సమస్యల పరిష్కరించాలని చేస్తున్న నిరసనలో భాగంగా 10వ రోజు కలెక్టరేట్ ఎదుట పచ్చగడ్డి తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10లక్షల ఇన్సూరెన్స్, కేటగిరి వారీగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు మాట్ల రాజు, గోయిరే నాగేశ్వర్, ఎస్కె సాబీర్, సిడాం కైలాస్, తోట సమ్మయ్య, జాడి విట్టు, యమున, లలిత, లక్ష్మి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ అన్నారు. శనివారం పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు కనీస వేతనం కోసం వారం రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న వారి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం మొండి వైఖరితో



పంచాయతీలో చెత్తా చెదారం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగి వచ్చి వారి న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు రాథోడ్ భీమ్‌రావ్, దిలీప్ మొరే, జెడ్పీటీసీ అర్క పుష్పలత ఉన్నారు.

కెరమెరి : జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం 8వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఒంటికాలుపై నిలబడి నిరసన తెలిపారు. జీపీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డల వెంకటేశం ఆధ్వర్యంలో కార్మికులు ప్రభుత్వ వైఖరికి నిరసన తెలిపారు. డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రాథోడ్ రాందాస్, నరేష్, సంతోష్, స్వామి, మల్లేష్ పాల్గొన్నారు.

బాసర : పంచాయతీ కార్మికులు శనివారం ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని దేగామలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దేవరావు మాట్లాడుతూ ప్రభుత్వం మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి, కార్మికులకు రూ.19వేల వేతనం అందించాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి కార్మికునికి డబల్ బెడ్‌రూమ్ అందించాలని కోరారు. కార్యక్రమంలో నగేష్, గంగాధర్, దేవన్న, లయాక్, సరుబాయి, కిరణ్ పాల్గొన్నారు.





పట్టువీడని కార్మికులు..పట్టించుకోని పాలకులు..!

వీక్లీ రౌండప్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తమ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులు సమ్మె బాట పట్టారు. పని భారం.. తక్కువ వేతనం..ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ నిరసన గళం వినిపిస్తున్నారు. ఆదివారం నాటికి పది రోజులు కావస్తున్నా కార్మికులు పట్టువీడటం లేదు. కార్మికులు విధుల్లో లేకపోవడంతో పల్లెల్లో వీధులన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. డంపింగ్‌యార్డులు బోసిపోతున్నాయి. రోడ్లన్ని అస్తవ్యస్తంగా మారుతున్నాయి. విధులు బహిష్కరించి మండల కేంద్రాల్లో నిరవధిక దీక్షకు దిగారు. విధుల్లో చేరాలని కొన్ని చోట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తున్నా..సమస్య పరిష్కారమయ్యే వరకు బెదిరే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. విధుల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు దిగుతున్నా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఖరాఖండిగా చెబుతున్నారు. మరోపక్క కార్మికులు విధుల్లో లేకపోవడంతో పల్లెలు కంపుకొడుతున్నా పాలకులు దృష్టిసారించడం లేదు. ప్రభుత్వం వీరి సమస్య పరిష్కారానికి ఏ మాత్రం చొరవ చూపడం లేదు. ఫలితంగా కార్మికుల్లో ప్రభుత్వం తీరు పట్ల మరింత అసంతృప్తి వ్యక్తమవుతోంది.

బారెడు పని..మూరెడు వేతనం..!

పంచాయతీ పారిశుధ్య కార్మికులను మల్టీపర్పస్ విధానంలో నియమించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 4500మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. రోడ్లు ఊడ్చడం..మురికికాల్వలు శుభ్రం చేయడం..డంపింగ్‌యార్డు నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ తదితర అన్ని పనులను వీరే చేయాల్సి ఉంటుంది. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం పొద్దుగూకే వరకు పల్లె శుభ్రత విధుల్లోనే ఉంటున్నారు.ఇంతటి ముఖ్య పాత్ర పోషిస్తున్న కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.9,500 మాత్రమే వేతనం అందజేస్తోంది. నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరిగిన ప్రస్తుత తరుణంలో ప్రభుత్వం అందజేసే వేతనం వీరి కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవడం లేదు. పైగా ఈ పారిశుధ్య పనులు చేవడుతున్న కార్మికులందరూ పేద వారే కావడం.. నిత్య కూలీ పనిచేస్తేనే పొట్టగడిచే పరిస్థితి ఉండటం వీరి ఆర్థిక స్థితిగతులను తెలియజేస్తోంది. వీరు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పలుమార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేకపోయింది. సమస్య పరిష్కారానికి పోరాటమే సరైన మార్గమని భావించిన కార్మికులు సమ్మె బాటపట్టారు. వీరు సమ్మె చేపట్టడంతో కొన్ని చోట్ల స్థానిక సర్పంచులు విధుల్లో చేరాలని బెదిరింపులకు పాల్పడుతుండగా.. మరికొన్ని చోట్ల ప్రభుత్వం వీరి కష్టాలు తీర్చాలని స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతుండటం గమనార్హం. నెలకు కనీసం వేతనం రూ.26వేలు అందజేయాలని, మల్టిపర్పస్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం వీరి పట్ల ఏ నిర్ణయం ప్రకటిస్తుందో త్వరలోనే తెలుస్తుందనే ప్రచారం జరుగుతోంది.



పంచాయతీ కార్మికుల ఆందోళన(ఫైల్)

మిషన్ భగీరథ ద్వారా సురక్షిత మంచినీటి సరఫరా

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్

నవతెలంగాణ-నస్పూర్

ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి నివాసానికి సురక్షిత మంచినీరు పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్, ట్రైనీ కలెక్టర్ పి. గౌతమి, మిషన్ భగీరథ ఈఎన్‌సి కృపాకర్‌రెడ్డితో కలిసి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని 12,769 గ్రామాలకు సురక్షిత మంచినీటిని అందిస్తున్నామని, ఐక్యరాజ్యసమితితో పాటు పలు విదేశీ సంస్థలు మిషన్ భగీరథ పథకాన్ని ప్రశంసించాయని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని 5మండలాల పరిధిలోని 102 గ్రామపంచాయతీలు, 3 మున్సిపాలిటీల పరిధిలోని 64 వార్డుల వారీగా మిషన్ భగీరథ, గ్రిడ్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అధికారులు రోడ్ మ్యాప్ నిర్దేశించుకుని అగస్టు 15లోపు పెండింగ్ పనులను పూర్తి చేయాలని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు 283 ట్యాంకుల నిర్మాణం పూర్తి చేసి 67,163 గృహాలకు 2 లక్షల62వేల మంది ప్రజలకు తాగునీరు అందిస్తున్నామన్నారు. పనులు పూర్తయిన గ్రామాల్లో జరుగుతున్న నీటి సరఫరాలో లీకేజీలు, పైపైన్లు దెబ్బతిన్నట్లయితే వెంటనే మరమ్మత్తు చేయాలని, మిషన్ భగీరథ పనుల వల్ల దెబ్బతిన్న రోడ్లను వెంటనే నిర్మించాలని, వార్డు, గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిలో ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ తాగునీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నియోజకవర్గాల వారీగా ప్రజల నుండి సమాచారం సేకరించి సమస్య ఉన్న ప్రాంతాలను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, గ్రామ స్థాయిలో మంచినీటి సరఫరాకు అధికారులతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది సహకరించాలని తెలిపారు. ఆయా ఏజెన్సీలకు కేటాయించి పనులను పూర్తి చేసిన వెంటనే క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరీక్షించిన అనంతరం బిల్లులు చెల్లించడం జరుగుతుందని, ఇప్పటి వరకు ఎలాంటి బిల్లులు బకాయి లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ జ్ఞాన్ కుమార్, ఈఈలు అంజన్‌రావు, మధుసూదన్, పంచాయతీరాజ్ ఈఈ ప్రకాష్ ఏఈలు, డిఈలు, మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిపి, జెడ్‌పిటిసిలు, సర్పంచులు, వివిధ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సంతూర్ మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపిక

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూరు మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కహేకషా భాను సంతూర్ మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. విద్యార్థినికి ఏడాదికి రూ.24 వేల చొప్పున మూడేళ్లకు 72 వేలు అందుతాయని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తిరుపతి, జగ్పాల్ సర్వర్ పాషా, ముకుందు, కృష్ణ గోపాల్, శ్రీనివాస్, కే.లలిత, శిరీష, స్వప్న పాల్గొన్నారు.



రేపు బీజేపీ బ్రిడ్జి దీక్షను జయప్రదం చేయండి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీష్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని అందవెల్లి-జగన్నాథ్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగు బ్రిడ్జి వద్ద సోమవారం బీజేపీ బ్రిడ్జి దీక్ష చేపట్టనున్నామని ప్రజలు ఈ దీక్షలో పాల్గొని జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీష్‌బాబు కోరారు. శనివారం అందవెల్లి బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రితం బ్రిడ్జి కూలిపోవడంతో నేటికీ ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. ప్రమాదకర పరిస్థితిల్లో దహెగాం మండల ప్రజలు కాగజ్‌నగర్ పట్టణానికి రావడానికి థర్మకోల్ తెప్పలపై ప్రయాణం చేస్తున్నారని అన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అసమర్థతే కారణమని విమర్శించారు. మూడు సంవత్సరాల క్రితం బ్రిడ్జి కుంగిపోతే కనీస మరమ్మతులు చేయించకుండా కాలయాపన చేయడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని దుయ్యబట్టారు. బ్రిడ్జి పునర్నిర్మాణం అని చెప్పి సంవత్సరం పాటు పనులు చేస్తూ కాలయాపన చేయడంతో ఈ వర్షాకాలం దహెగాం మండల ప్రజలు కాగజ్‌నగర్ పట్టణానికి రావడానికి చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి దీక్ష ప్రారంభమవుతుందని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బ్రిడ్జి నిర్మాణం త్వరితగతన పూర్తయ్యే విధంగా ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిర్సింగుల తిరుపతి, నాయకులు గురిజాల మొండి, చన్కపురి గణపతి, పూదరి శ్రావణ్, వేల్పుల గంగయ్య, వెంకటేష్, కొండ తిరుపతి పాల్గొన్నారు.

పేపర్ బ్యాగులను ఆవిష్కరించిన జీఎం



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని రెయిన్‌బో పాఠశాల విద్యార్థులు స్వయంగా తయారు చేసిన పేపర్ బ్యాగులను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పర్యావరణ పరిరక్షణలో భాగంగా రెయిన్‌బో స్కూల్ పిల్లలు పేపర్ బ్యాగులను తయారు చేయడం చాలా సంతోషకరమన్నారు. స్కూల్ పిల్లలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడడంలో తమ వంతు కృషి చేయాలని పేర్కొన్నారు. పేపర్ బ్యాగులను తయారు చేసిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన స్కూల్ యాజమాన్యాన్ని జీఎం అభినందించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, డిజిఎం ఐఈడి చిరంజీవులు, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్, ప్రిన్సిపాల్ రజిని, కరస్పాండెంట్ అమన్ ప్రసాద్ పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరందించడమే లక్ష్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

చివరి ఆయకట్టు వరకు నీరందించడమే లక్ష్యమని అసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. వట్టివాగు ప్రాజెక్టు నుండి ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వట్టివాగు ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు వరకు నిరందించడమే లక్ష్యమన్నారు. ప్రస్తుతం కొంత వర్షభావ పరిస్థితులు ఉన్నప్పటికీ వరి పంటకు కాలువ నీటిని వినియోగించుకోవాలన్నారు. కాలువ ఎక్కడైనా పూడికతీత అవసరమైతే రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సాధ్యమైనంత మేరకు ఎప్పటికప్పుడు పూడికతీత పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ గుణవంతరావు, వైస్ ఎంపీపీ సుంకరిమంగా పెంటయ్య, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, సర్పంచులు భీమేష్, బాపురావు, ఆత్రం దినకర్, ఏఈ షేక్ జానీ పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓను కలిసిన తోటి సేవా సంఘం నాయకులు

నవతెలంగాణ-హాజీపూర్

తోటి సేవా సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉట్నూర్‌లో ఐటీడీఏ పీఓ చాహత్ భాజుపాయ్‌ని కలిసారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వల్క చిలుకయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సెంగ వెంకటేష్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కుడిమేత తిరుపతి మాట్లాడుతూ తమ జాతిలో చాలా కుటుంబాలకు నివాస గృహాలు లేవన్నారు. సీడీపీ నిధుల ద్వారా 50 ఇండ్లు కేటాయించాలన్నారు. చాలా మంది కాన్సర్, మూత్ర పిండాలా సంబంధిత వ్యాధులతో మరణిస్తున్నారన్నారు. అందువల్ల ప్రతి కుటుంబానికి హెల్త్ ఇన్సూరెన్సు చేయించాలనీ కోరారు. వ్యక్తి గత రుణాలు బ్యాంక్ గ్యారంటీ లేకుండా మంజూరు చేయాలన్నారు. మంచిర్యాల జిల్లాలో గిరిజన గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, తిరుపతి, శ్రీదేవి, దేవేంద్ర పాల్గొన్నారు.

గంగాపూర్‌లో వైద్య శిబిరం

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని గంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని లంబాడీతండా గోండు గూడెంలో శనివారం వైద్యసిబ్బంది వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ముందుగా ఇంటింటా తిరుగుతూ రాపిడ్ ఫీవర్ సర్వే చేశారు. వైద్యశిబిరంలో జ్వరం జలుబు ఉన్న 27 మందికి మందులు పంపిణీ చేసినట్లు సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్ పేర్కొన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. బావులో వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ పౌడర్ కలపాలని సూచించారు. కార్యదర్శి ముండే రమేష్, వైద్యసిబ్బంది సుశీల, చౌహన్ సింధు అశాలు విజయలక్ష్మి, సునీత ఉన్నారు.

పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ నాయకుల మద్దతు

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు శనివారం బోథ్ నియోజవర్గ కాంగ్రెస్ నాయకులు ఆడే గజేందర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమస్యలు, డిమాండ్లను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. లేనియెడల కార్మికులతో కలిసి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎల్లప్పుడు కార్మికులకు మద్దతుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆడే.వసంతరావు, బోథ్ కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు అల్లూరి ప్రఫుల్ చందర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఏలేటి.రాజశేఖర్‌రెడ్డి, అమర్‌సింగ్ పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాల సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ- ఖానాపూర్

ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, రెసిడెన్షియల్ కళాశాలలో ఐదవ తరగతి మైనారిటీ విభాగంలో, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలో మైనారిటీ విభాగంలోని మిగులు సీట్ల భర్తీకై ప్రవేశం దరఖాస్తులు చేసుకోవాలని ఆర్ఎల్‌సీ జిల్లా సమన్వయకర్త కెప్టెన్ సలీముద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను పాఠశాలలో 20తేదిలోపు అందజేయాలని అన్నారు. దరఖాస్తుల కోసం వారి ఆధార్ కార్డు, ఫోటో తీసుకొని మైనార్టీ కళాశాలలో దరఖాస్తు చేసూకోవాలని అన్నారు. తెలంగాణ మైనార్టీ గురుకులంలో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు ఉంటాయని అన్నారు. ఐఐటీ, ఐఐటీ, నిట్, వెటర్నరీ, బీఫార్మసీ మొదలగు పై చదువులకు విద్యార్థులకు తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల పునాదిగా మారుతుందని అన్నారు. ప్రయివేటు కళాశాలకు ధీటుగాపై చదువులకు మంచి నైపుణ్యాలను, ప్రదర్శిస్తూ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల ముందుకు సాగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉన్నత విద్య బోధన కోసం ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం కళాశాలలకు రూపురేఖలను మారుస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ అడ్మిషన్ వివరాల కోసం ప్రిన్సిపల్ సత్యంను సంప్రదించాలని కోరారు. వివరాలకు 9676912915, 9494027314 నెంబర్‌లకు సంప్రదించాలని కోరారు.

తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

నవతెలంగాణ-కుబీర్

సీఎం కేసీఆర్ ఎన్ని డ్రామాలు ఆడినా బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోస్లే మోహన్‌రావు పటేల్ అన్నారు, శనివారం పల్లె పల్లెకు బీజేపీ, గడప గడపకు మోహన్ రావు కార్యక్రమంలో భాగంగా మండలంలోని డోడర్న, గ్రామాలలో పర్యటించి, బీజేపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎర్పాటు చేసిన రచ్చ బండ కార్యక్రమంలో గ్రామ సమస్యలపై ఆయన ప్రసంగిస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు జాదవ్ పండిత్, మనోజ్, కమలేష్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయానికి సహకరించాలి

నవతెలంగాణ- ఖానాపూర్‌రూరల్

మున్సిపాలిటీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తాగునీటి పైపులైన్ మార్చాల్సి వచ్చిన సందర్భంగా ప్రజలకు తాగునీటి సరఫరాలో ఏర్పడనున్న అంతరాయానికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు ఐదు రోజుల పాటు మున్సిపల్ పరిధిలోని 12 వార్డులతో పాటు మస్కాపూర్, సుర్జాపూర్, బాదనకుర్తి, మేడంపెల్లి గ్రామపంచాయతీలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, అంతరాయాన్ని ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

ఇండియన్ ఉమెన్ నెట్వర్క్ సదస్సులో ఆర్జీయూకేటీ విద్యార్థులు



నవతెలంగాణ-బాసర

హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీలో నిర్వహించిన ఇండియన్ ఉమెన్ నెట్వర్క్ సదస్సులో శనివారం ఆర్జీయూకేటీ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ మాట్లాడుతూ సదస్సుల ద్వారా మహిళా సాధికారికత సాధించేందుకు దోహదపడే అంశాలు, ప్రపంచీకరణ నేపథ్యంలో పెరుగుతున్న పోటీకి అనుగుణంగా యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు ఉద్యోగావకాశాలను పెంపొందించేందుకు ఈ సదస్సులు ఎంతోగానో ఉపయపడుతాయని అన్నారు. డైరెక్టర్ సుహారిక మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉద్యోగాల కోసం సన్నద్ధం కావడానికి మానసిక ధృక్పథాన్ని కలిగి ఉండాలని అపజయాలను విజయాలుగా మల్చుకోవడం గూర్చి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు హరిబాబు, రాకేష్‌రెడ్డి, తేజస్విని, ప్రణయ, నాగమణి విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో ఎస్సైల బదిలీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలోని 25 మంది ఎస్సైలను బాసర జోన్ పరిధిలోని ఇతర జిల్లాలకు, అదేవిధంగా ఇతర జిల్లాలలో పనిచేస్తున్న 26 మంది ఎస్సైలు ఆదిలాబాద్ జిల్లాకు కేటాయిస్తూ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి సిఫార్సుల మేరకు మల్టీ జోన్ వన్ ఐజీ ఇన్‌చార్జి నిజామాబాద్ జోన్ డీఐజీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఎస్సైలు, అదేవిధంగా ఎస్సైల స్థానికత అదిలాబాద్ జిల్లా ఉండటం వల్ల ఈ 25 మంది ఎస్సైలు ఇతర జిల్లాలకు బదిలీ అయినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ బదిలీ ప్రక్రియ అన్ని జిల్లాలలో నిర్వహిస్తున్నట్లు అదే విధంగా ఆదిలాబాద్ జిల్లాలో నిజామాబాద్ రేంజ్ పరిధిలో నేడు బదిలీ ప్రక్రియలో భాగంగా ఉత్తర్వులు వెలువడిందపి ఎస్పీ ఒక ప్రకటనలో వివరించారు.

విద్యుద్ఘాతంతో యువకుడి మృతి

నవతెలంగాణ-ఉట్నూర్

వ్యవసాయ భూమిలో కరెంట్ పోల్ సమీపంలో వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా విద్యుద్ఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని టక్కుగూడలో చోటు చేసుకుంది. ఎస్సై భరత్ సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని టక్కుగూడ గ్రామానికి చెందిన పంద్ర జైతు(24) తమకున్న వ్యవసాయ భూమిలో పనులు చేసేందుకు వెళ్లాడు. మృతుడు కుటుంబ సభ్యుల పొలంలోని కరెంట్ పోల్ సమీపంలో పనులు చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబానికి చెదోడు వాదోడుగా ఉండే జైతు మృతి చెందడం పట్ల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. జైతు గ్రామంలో అందరితో కలిసి ఉండేవాడని గ్రామస్తులు పేర్కొన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మెరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై టమాటా లారీ బోల్తా

- ఎగబడిన జనం.. పహారా కాసిన పోలీసులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రస్తుతం టమాటాలను ప్రజలు బంగారంగా భావిస్తున్నారు. ఎందుకంటే వాటి ధరలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. తాజాగా కర్ణాకట నుంచి టమాటా లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. విషయం తెలుసుకున్న జనాలు ఒక్కసారిగా ఎగబడ్డారు. టమాటాలు అందినకాడికి ఎత్తుకెళ్లారు. ఈ ఘటన శనివారం జాతీయ రహదారి 44పై ఆదిలాబాద్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, మావల పోలీసుల వివరాల ప్రకారం.. దేశ వ్యాప్తంగా టమాటా ధరలు భగ్గుమంటున్న విషయం తెలిసిందే. అయితే, దేశంలో ఎక్కువగా టమాటా పంటను పండించేది కర్నాటక. ఈ రాష్ట్రం నుంచి దేశంలో వివిధ రాష్ట్రాలకు టమాటా ఎగుమతులు భారీగా జరుగుతాయి. ఈ క్రమంలోనే ఓ లారీ టమాటా లోడ్‌తో ఢిల్లీ వెళ్తోంది. ఇంతలో ఆదిలాబాద్‌లోని మావల బైపాస్ వద్ద అదుపు తప్పిన లారీ బోల్తా పడింది. ఒక కారును, ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. దీంతో లారీలోని టమాటాలన్నీ కింద పడిపోయాయి. అది చూసిన జనాలు, సమాచారం అందుకున్న ప్రజలు టమాటాల కోసం ఎగబడ్డారు. అయితే, విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ప్రజలను కంట్రోల్ చేసి, టమాటాలు ఎత్తుకెళ్లకుండా బందోబస్తు చేపట్టారు. ప్రమాదంపై ఆరా తీశారు. దాదాపు రూ.18 లక్షలు విలువ చేసే టమాటా అందులో ఉన్నట్లు అందులో 50శాతం డామేజ్ అయ్యే అవకాశం ఉన్నట్టు లారీ డ్రైవర్ తెలిపారు. కాగా మరో లారీలో లోడ్ తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. అప్పటివరకు పోలీసులు అక్కడే ఉన్నారు.

కులం పేరుతో రాజకీయం చేయొద్దు

నవతెలంగాణ-లక్ష్మణచాంద



కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీహరిరావు కులం పేరుతో రాజకీయం చేస్తున్నారని అలా చేయొద్దని జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడ్వాల రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వహించారు. మున్నూరు కాపుల జోలికొస్తే మూల్యం తప్పదని హెచ్చరించారు. కుచాడి శ్రీహరిరావు ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని లేకపోతే భవిష్యత్తులో మున్నూరుకాపుల సత్తా చూపిస్తామని అన్నారు. ఇటీవల బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా నిర్మల్ జిల్లా మాజీ మున్సిపల్ చైర్మెన్ అప్పాల గణేష్, మంత్రి వయసుకు గౌరవం ఇచ్చి పాదాభివందనం చేయడం చూసి సహించలేక ఓటమి భయంతో విమర్శలు చేయడం సరికాదని జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ తెలిపారు.నిర్మల్ నియోజకవర్గంలోని మున్నూరు కాపులు వివిధ రాజకీయ పార్టీలలో ప్రజలకు సేవ చేస్తున్నారు. కొంత మంది మున్నూరు కాపులు నేటికి కాంగ్రెస్ పార్టీలో ఉండి, శ్రీహరిరావు కొరకు కూడా నేటికి కష్ట పడుతున్న మున్నూరు కాపులను అవమానించడం సరికాదని అడ్వాల రమేష్ సూచించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు నాయకులు, ఓస మల్లేష్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేయడం తగదు

- మాజీ ఎంపీ రాథోడ్ రమేష్

నవతెలంగాణ-ఉట్నూర్



బీజేపీ పార్టీపై, పార్టీ అభ్యర్థులపై అసత్య ఆరోపణలు చేయడం తగదని మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను బీజేపీ పార్టీ నుంచి ఇతర పార్టీలకు వెళ్తున్నట్లు ప్రచారం చేయడంలో ఏ మాత్రం నిజం కాదన్నారు. ఎన్నికల్లో కచ్చితంగా బీజేపీ గెలుపు ఖాయమని, బీజేపీలోనే ఉంటూ బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. ఎక్కడికి వెళ్లిన బీజేపీ ఆధరణ లభిస్తుందని అన్నారు. బీఆర్ఎస్ నీయంత పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో రాష్ట్రాల నుండే కాకుండా దేశాల నుంచి అభ్యర్థులు పోటీకోసం ఇక్కడికి రావడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేక పోయిందని, కేవలం కుటుంబ పాలన కొనసాగుతుందన్నారు. ప్రజలు ఇట్టి విషయాన్ని గమనిస్తున్నారని దళితులకు మూడు ఎకరాల భూమి, బీసీలకు లక్ష రూపాయలు రుణ సదుపాయం అంటూ బీఆర్ఎస్ నాన్చుడు ధోరణి అవలంబిస్తుందని అన్నారు. ప్రస్తుతం జీపీ కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి ధర్నాలు చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి కేవలం నిర్మల్ జిల్లాకే పరిమితమయ్యారని అక్కడే దోచుకుంటూ కాలం గడుపుతున్నారని అన్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్త పాదయాత్రలో భాగంగా కిషన్, బండి సంజయ్‌ల రూట్ మ్యాప్ తయారవుతుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు శ్రీరాం నాయక్, కొండెరి రమేష్, బొడ్డు కిరణ్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువు : ఎన్ఎస్‌యూఐ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తోట కపిల్, జిల్లా అధ్యక్షులు శాంతన్‌రావు అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు ఎన్ఎస్‌యూఐ బృందం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిట్టలవాడలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించగా అనేక సమస్యలు కనపడ్డాయని అన్నారు. అసాంఘీక శక్తులకు అడ్డాగా, విష క్రిమికీటకాలకు నిలయంగా ఆ పాఠశాల మారిందని అన్నారు. 30 మందిపైగా ఉన్న ఈ పాఠశాలలో చిన్నపాటి అడవిని తలపించేలా ఉందన్నారు. ప్లేగ్రౌండ్ పాఠశాల పర్యావరణాన్ని కూడా శుభ్రం చేయించకపోవడం సిగ్గుచేటని అన్నారు. బంగారు తెలంగాణలో విద్యార్థుల పరిస్థితి ఆగం అవుతుందన్నారు. ప్రతి పాఠశాలను ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉంచాలని అన్నారు. పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పెట్టాలని అన్నారు. సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని అన్నారు.

బీఆర్ఎస్ నాయకుల గుండెల్లో గుబులు పుడుతోంది : బీజేపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్ది బీఆర్ఎస్ పార్టీ గుండెల్లో గుబులు పుడుతోందని, అందుకే బీసీలను ఆకట్టుకునేందుకు వారికోసం సంక్షేమ పథకాల పేరిట కొత్త మోసాలకు ప్రభుత్వం తెరలేపిందని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ ఆరోపించారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ బీసీలను, గొల్ల కురుమలను మోసం చేసిన విధానం చూస్తుంటే ఎన్నికల్లో తాము గెలవమని ప్రజలను మభ్యపెడుతూ సంక్షేమ పథకాలు చూపిస్తూ, మళ్లీ ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు ఉదాహరణ జిల్లాలో 3వేల 600 మంది గొల్ల కురుమలు దరఖాస్తు చేసుకోగా అందులో కేవలం 112 మందికి మాత్రమే గొర్రెలను ఇప్పటి వరకు మంజూరు చేశారని అన్నారు. 2వేల 400 మంది ఒక్కొక్కరు రూ.43,750 డీడీలను చెల్లించి, సంవత్సరం గడిచిందని అన్నారు. వారికి గొర్రెల పంపిణీ మాట పక్కన పెడితే రూ.40 వేలకు వడ్డీ రూ.5చొప్పున దాదాపు రూ.30వేలు అయిందన్నారు. తమకు గొర్రెలు వస్తాయని వాటితో ఇంత బ్రతుకుతెరువు చూసుకోవచ్చని భావించారని అన్నారు. బీసీలకు గొల్ల కురుమలకు ప్రకటించిన పథకాలను 15 రోజుల్లో అందజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లాలోని ఎమ్మెల్యేల ఇంటిని స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న ఇంటిని ఘేరావ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు లోక ప్రవీణ్, రత్నాకర్ రెడ్డి, జోగు రవి, మయూర్ చంద్ర, భీమ్ సేన్‌రెడ్డి, చిలుకూరి జ్యోతిరెడ్డి, విజయ్, శ్రీనివాస్, సాయి, ముకుంద్, సూర్య, గోపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటికి వచ్చే సిబ్బందితో ప్రజలు సహకరిస్తూ ఓటీపీ చెప్పాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో ఆదిలాబాద్ పురపాలకం పాల్గొననుందని మున్సిపల్ కమీషనర్ శైలజ తెలిపారు. శనివారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని, పలు వివరాలను వెల్లడించారు. లక్ష నుండి మూడు లక్షల జనాబా కేటగిరిలో ఆదిలాబాద్ పట్టణం స్వచ్ఛ సర్వేక్షన్‌లో పాల్గొననుందని తెలిపారు. సిటిజెన్ వాయిస్ విభాగంలో పాల్గొంటున్న నేపథ్యంలో ప్రత్యేకంగా మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో బృంద సభ్యులు పర్యటించి ప్రజల అభిప్రాయాలను సేకరిస్తారని వివరించారు. పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత వంటి అంశాలపై ప్రజల అభిప్రాయాన్ని స్వీకరిస్తారని, ఇంటికి వచ్చే సిబ్బందితో ప్రజలు సహకరిస్తూ ఓటీపీ చెప్పాలని సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యాలయ పనివేలల్లో సంబంధిత అధికారి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటారని వివరించారు.

ఐటీడీఏ అధికారుల పనితీరు మార్చుకోవాలి

- జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవ లక్ష్మీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐటీడీఏ అధికారుల పనితీరు మార్చుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈఓ రత్నమాల అధ్యక్షతన జిల్లా స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.100 కోట్ల నిధులు వచ్చినప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందని ఇష్టారీతిన అధికారులు పనిచేస్తున్నారని అన్నారు. అవసరమున్న చోట నిధులు ఖర్చు చేయడం లేదని కనీసం సమాచారం కూడా అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి ఈఈ స్థాయి అధికారి రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. జైనూరు మండలంలోని గిరిజన గూడాలను కలిపే మూడు రహదారులు పూర్తి చేస్తే మండలంలో ఇబ్బందులు తొలుగుతాయని ఆ దిశగా అధికారులు పనిచేయకపోవడం దారుణం అన్నారు. జిల్లా తెచ్చుకున్నప్పటికీ అనుకున్న స్థాయిలో అభివృద్ధి కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తిర్యాని మండలం ఉల్లిపిట్ట గ్రామం వద్ద నిర్మించిన బ్రిడ్జి కూలిపోయేలా ఉందని దానిని మరమ్మతులు చేయాలన్నారు. గుండి బ్రిడ్జి ఎన్ని సంవత్సరాలు పడుతుందని వచ్చే సంవత్సరంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీలు అజయ్ కుమార్, సంతోష్, ద్రుపదభాయ్ చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యులు అబూ తాలిబ్, సిద్ధికి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన ఆర్డీఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్డీఓగా బి.స్రవంతి నియమితులయ్యారు. నిర్మల్ ఆర్డీఓగా పనిచేస్తున్నా ఆమెను ఇక్కడకు బదిలీ చేస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా శనివారం ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన ఆమె స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమెకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

డప్పులతో జీపీ కార్మికుల నిరసన ర్యాలీ

నవతెలంగాణ-వేమనపల్లి

గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా శనివారం 10వ రోజు గ్రామంలో డప్పులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు జాడి మహేష్ మాట్లాడుతూ గ్రామాల్లో అనునిత్యం పారిశుధ్య పనులు చేస్తూ జనజీవనంలో మమేకమై గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి అనునిత్యం ప్రజా సేవలో పనిచేస్తున్నామని, అలాంటిది తమకు పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్లతో శాంతియుతంగా సమ్మె చేస్తున్నామని అన్నారు. 10రోజులు గడిచిన కూడా ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోవడం లేదని అన్నారు. సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో డప్పుల ర్యాలీ కార్యక్రమాని చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చప్పిడి తిరుపతి, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఏక్తార్, కార్యదర్శి ఇరుగురాల వెంకటేష్, కార్యవర్గ సభ్యులు డోలే రాజబాపు, టకిరె శ్రీకాంత్, ఆర్ల లచ్చన్న, పెరుమల మారయ్య, బొడ్డు రాజేష్, మడే తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలో సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాలు పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేషధారణతో బోనాలు ఎత్తుకున్నారు. పిల్లల వేషధారణ, అలంకరణ అందరిని ఆకట్టుకున్నాయి. బోనాల పండుగ విశిష్టతను వాసవి మాతాజీ, నవనీత మాతాజీ వివరించారు. ఈ ఉత్సవంలో పోషకులు సంగేవార్ గణేష్, వార్లే లక్ష్మణ్, ప్రధానాచార్యులు సారథి రాజు, అకాడమిక్ ఇన్‌చార్జి స్వప్న శర్మ, ఆచార్యులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏజెన్సీలోని దళితుల భూములకు పట్టాలివ్వాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఏజెన్సీలో నివసిస్తున్న దళితులు సాగుచేస్తున్న పోడు భూములకు ప్రభుత్వం పట్టాలివ్వాలని దళిత సంఘం నాయకులు సోముర్రే నాగోరావ్ అన్నారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీలో తమ తాత ముత్తాతల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల పోడు వ్యవసాయం సాగుచేస్తున్న ఆదివాసులకు మాత్రమే హక్కుపత్రాలను జారీ చేసిందని అన్నారు. దళితులకు మాత్రం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏజన్సీలో నివసించే దళితుల భూములకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని యెడల దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీవునే, అనిల్ పాల్గొన్నారు.

చేయని పని చేసినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటు

నవతెలంగాణ-బేల

గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాము ప్రయత్నిస్తే చేయని పని తామే చేసినట్టు చెప్పుకోవడంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులకు సిగ్గనిపించడం లేదా అని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ప్రశ్నించారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఏటి గ్రామంలో రేషన్‌షాప్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి, గ్రామస్తులతో కలిసి తమ యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పలుమార్లు మండలం, జిల్లా అధికారుల వద్దకు వెళ్లి సమస్యను వివరించామని తెలిపారు. దీంతో అధికారులు స్పందించి ఏటి గ్రామంలో రేషన్ సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. అయితే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్‌తో పాటు ఇతర బీఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామానికి వెళ్లి సబ్ సెంటర్ ప్రారంభం సందర్భంగా ఈ సబ్ సెంటర్‌ను ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో తామే ఏర్పాటు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామాల్లో వెళ్లి ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని హితవుపలికారు. ఈ మీడియా సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు గావండే ఘన శ్యామ్, యూత్ కాంగ్రెస్ డిస్టిక్ జనరల్ సెక్రటరీ ఎండీ అఖిల్, యూత్ కాంగ్రెస్ బేల మండల అధ్యక్షుడు గోడే అవినాష్, యూత్ కాంగ్రెస్ మండల ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ బాపురావు, పార్టీ నాయకులు కన్న రాజు, బోయర్ ప్రమోద్ పాల్గొన్నారు.